# శుచి-శుభ్రత

- కోనేనేగ వెంకట ఆంజనేయులు



రవ్వదోసె చాలా బాగుంది. దానికి తోడు కొబ్బరి చెట్నీ కూడా మంచి రుచిగా ఉండటంతో మరో దోసెకు ఆర్డరిచ్చాను.

రెండో దోసెతింటుండగా అప్పుడు వినిపించింది గొడవ. తలెత్తి చూద్దును కదా - అతనే! ఎర్రటోపీ అతను. సప్లయర్‌తో గొడవ పడుతున్నాడు - మంచినీళ్ళలో నలకలున్నాయని.

ప్రయాణం మొదలైన దగ్గరనుండే చూస్తు న్నాను - వెళ్ళిన ప్రతి హోటల్లోనూ గొడవపెట్టు కుంటు న్నాడతను శుచీ, శుభ్రత పాటించడం లేదని.

“తప్పయిపోయింది సార్! మరోగ్లాసుతో నీళ్ళు తీసుకు వస్తానని.” సర్వర్ అంటున్నా వినిపించుకోకుండా అతనితో ఘర్షణ పడుతున్నాడా ఎర్రటోపీ అతను.

పాపం ఆ సర్వర్ - యజమాని గమనిస్తాడేమోనని చాలా నెమ్మదిగా మాట్లాడుతున్నాడతనితో. దాంతో ఎర్రటోపీ అతను రెచ్చిపోయి ఇంకా గట్టిగా కేకలు వెయ్యసాగాడు.

చివరికి హోటల్ యజమాని వచ్చి క్షమాపణలు చెప్పుకుంటేనే గానీ అతను శాంతించలేదు. మేమంతా టూరిస్టు బస్‌లో పుణ్య క్షేత్రాలు, ముఖ్యమైన పట్టణాలూ దర్శిస్తున్నాం! బస్‌లో పిల్లా, పెద్దా, ఆడా, మగా కలసి అరవై మంది వరకూ ఉంటాం!

ప్రయాణం మధ్యలో ఏ హోటల్‌కి వెళ్ళినా పరిశుభ్రత లేదంటూ సర్వర్స్ మీదా, హోటల్ యజమానులమీదా విరుచుకుపడుతూ అందరి దృష్టినీ ఆకర్షించాడు ఆ ఎర్రటోపీ అతను.

నేను కూడా ప్రతిచోటా అతన్ని గమనిస్తున్నాను

ఏ హోటల్‌కి వెళ్ళినా శుభ్రత లేదంటూ -

యిడ్లీలో ఈగలొచ్చాయని -

మంచినీళ్ళలో నలకలున్నాయనీ -

టిఫిన్ ప్లేట్లు సరిగ్గా కడగలేదని -

హోటల్ వాళ్ళతో గొడవ పెట్టుకోవడం మామూలైపోయిందతనికి -

మా అందరికీ రాని నలకలు , ఈగలు వగైరా అతని టిఫిన్స్‌లోనే రావడంనాకు చాలా ఆశ్చర్యం కలుగజేస్తోంది.

మా ప్రయాణం మొదలై అప్పుడే నాలుగురోజు లైపోయింది. ఈ నాలుగు రోజుల్లో రోజుకి మూడు చోట్ల చొప్పున మొత్తం పన్నెండు హోటళ్ళలోనూ అతను గొడవ పెట్టుకోవడం గమనించాను నేను.

ఆ రోజు నా మజిలీ అన్నవరం!

ఉదయమే అన్నవరం కొండ ఎక్కుతోంది మా బస్సు. బస్సు కొండపైకి ఎక్కుతోంటే చల్లటి గాలి శరీరాన్నీ, మనసునీ ఆహ్లాదపరుస్తోంది.

చుట్టూ కొండలు, ఆ కొండల నడుమ మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్నది - మనసుకి ఓ అనిర్వచనీయమైన ఆనందాన్ని కలుగజేస్తున్నాయి.

కొండపైకి వెళ్ళిన తరువాత కాలకృత్యాలు తీర్చుకుని దేవుడి దర్శనానికి వెళ్ళాను.

ప్రశాంతమైన మనసుతో వ్రతం చేయించుకుని మనసునిండా ఆనందం నింపుకొని బయటకు వచ్చేటప్పటికి టైము పన్నెండు గంటలు కావస్తోంది.

ఎండతీక్షణంగా ఉంది.

దేవస్థానం ముందున్న పలకలమీద ప్రతిఫలించిన ఎండ కళ్ళు చెదరగొడుతోంది.

స్వామివారి ప్రసాదం కొస్తనోట్లో వేసుకుని మిగతాపొట్లం సంచీలో పెట్టాను.

బాగా ఆకలిగా ఉంది. ఉదయం నుండీ ఏమీతినకపోవడంతో.

ఎదురుగా భోజనశాల కనిపిస్తుండడంతో దాన్లోకి నడిచాను.

నాతోటి ప్రయాణీకులు కూడా చాలా మంది భోజనం చెయ్యడానికి హోటల్ వైపు రావడం గమనించాను నేను.

భోజనం ఆర్డర్ చేశాను.

భోజనం చేస్తూనే నేను గమనించిన విషయం ఏమిటంటే -

ఖాళీ అయిన టేబుల్స్ మీద ఉన్న ఎంగిలి ప్లేట్లు ఓ క్లీనర్ కుర్రాడు తీస్తుంటే - ఖాళీ అయిపోయిన ఎంగిలి గాజు గ్లాసులు మరో కుర్రాడు జాగ్రత్తగా తీస్తున్నాడు.

నేను గమనిస్తూనే భోజనం చేస్తున్నాను.

నాకు ముందున్న టేబుల్ మీద ఖాళీ అయిన ప్లేట్లన్నీ జాగ్రత్తగా ఒకదాని మీద ఒకటి పేర్చుకుని లోపలికి తీసుకుపోయాడు ఓ కుర్రాడు.

ఎంగిలి గ్లాసులు తీసుకుపోవడానికి మరో కుర్రాడు వచ్చాడు.

నాలుగైదు గ్లాసులున్నాయి ఆ టేబుల్‌మీద. ఆ కుర్రాడు ఓ ఖాళీ గ్లాసులో - మిగతా గ్లాసుల్లో మిగిలి ఉన్న ఎంగిలి నీళ్ళన్నీ పోశాడు. ఆ గ్లాసునీళ్ళతో నిండింది.

అంతలో ఎర్రటోపీ మనిషి వేగంగా రావడంతో ఆయాసపడుతున్నాడు.

రావడంతోనే - ఆ కుర్రాడు ఎంగిలి నీళ్ళతో నింపిన నిండుగ్లాసు అందుకుని గబగబా ఆ నీళ్ళన్నీ త్రాగేసి 'హమ్మయ్య' అనుకున్నాడు.

ఆ కుర్రాడు వింతగా చూశాడతనివంక.

నేను నవ్వు ఆపుకోవడానికి పడిన శ్రమ ఫలించలేదు.

తెరలు తెరలుగా నవ్వుతున్న నావైపు వింతగా చూశాడు ఎర్రటోపీ అతను నేనెందుకు కంతలా నవ్వుతున్నానో అర్థంకాక.

❋